51

# పాముని చంపిన కఱ్ఱ

పడమటి గాలి పొలాల మీంచి వీస్తూ వుంటే, వూరు పరిస్థితి చూసి వుస్సురంటున్నట్టు చప్పుడు చేస్తోంది వూరి చివర రావిచెట్టు. చెట్టు కింద గుడిలో 'ముత్తేలమ్మ', తన కళ్ళ ముందే హత్యలు, గృహదహనాలు, మానభంగాలు - ఒక్కటేవిటి? ఎన్నో నరాంతక కృత్యాలు జరుగుతూ వుంటే, తనకేం జరగబోతోందోనని భయపడుతున్నట్లు నిస్సహాయంగా నిలువుగుడ్లేసుకు చూస్తోంది.

గుడి ముందు, అరుగు మీద గీతోపదేశం చేస్తున్న కృష్ణభగవానుడ్లా కూర్చొన్నాడు పంతులు తాత. అప్పుడే ముగ్గులోనుంచి తీసినట్టుంది అతని జుట్టు. ఎన్నో కష్టాలు, కడగండ్లు చవిచూసినట్టున్న ముఖంలో పట్టుకోడానికి ఆధారంగా కండలు లేక వేళ్లాడుతోంది చర్మం. మనసులో మసులుతోన్న భావాల్ని ముఖంలో కన్పించకుండా మూత పెట్టినట్టున్నాయి ముడతలు.

అతని కాళ్ళ దగ్గర - అరుగు కింద, గీతోపదేశం ఆలకిస్తోన్న అర్జునుడిలా బిక్కు బిక్కుమంటూ కూర్చొన్నాడు రాఘవులు. అతని ఒంటినిండా కండలున్నాయి. మనసు నిండా విషాదం వుంది. గుండెల నిండా భయంవుంది. వాళ్లిద్దరి మధ్యా నలుపు నక్కపల్లి బాణాకఱ్ఱ వుంది.

వూరు వల్లకాటిలా అయిపోయింది. ఒక్కటిగా వున్న పేద ప్రజ రెండు ముక్కలైపోయింది. ఒకళ్ళ నొకళ్ళు నరుక్కుని నిష్కారణంగా బలైపోతున్నారు. బలై పోతున్న వాళ్ళూ, బలిస్తున్న వాళ్ళూ ఒకే వర్గం - పీడిత వర్గం. బలి తీసుకుంటున్న వాడు మాత్రం పై వర్గం - దోపిడీ వర్గం. ఈ వర్గ పోరాటంలో పైవాడు ఎప్పుడూ బలహీనుడే! కిందివాడే బలవంతుడు. పైవాడికిసంపద వుంటే, కింది వాడికి శక్తి వుంది. ఆ సంపదతో శక్తిని చీల్చాలి. అది ఆ వర్గనైజం.

చీలిపోయింది వూరు.

చచ్చిపోయింది సంఘటిత శక్తి.

ఎందరో చచ్చిపోయారు.

చావగా మిగిలిన వాళ్లని పోలీసులు పట్టుకుపోయారు.

కానీ, వీటన్నిటికీ కారణం అయిన జగన్నాథం మాత్రం హాయిగా ప్రియురాలి ఒడిలో ప్రతి రాత్రి నిశ్చింతగా నిద్రపోతున్నాడు.

తగాదాలకు మూల కారణమైన సమస్యలు సమస్యలుగానే వుండిపోయేయి.

ఊరు రెండు ముక్కలైపోయింది,

ఊళ్ళో స్వార్థపరుల్ని చేరదీసి, తాగించి వూరిమీదికే వుసిగొల్పుతున్నాడు జగన్నాథం.

-నేను కొత్తగా యీ వూరొచ్చేటప్పటికీ, ఇలాగే అయోమయంగా అస్తవ్యస్థంగా వుంది వూరు. పేదవాడు నోరు విప్పి పలకటానికి వీల్లేదు. ఉన్నవాడు అన్నదే వేదం.

-ఇప్పుడు జగన్నాథం ఒక్కడే. అప్పుడు అయిదుగురు భూస్వాములుండేవారు. అయిదుగురికీ అయిదు ముఠాలు అంగరక్షకులుగా మనవాళ్ళే వుండేవాళ్ళు.వాళ్ళ నరాలకి ఆకలై ఆజ్ఞాపిస్తే అక్కలని, చెల్లెళ్ళని సిగ్గు లేకుండా తీసికెళ్లి అప్పజెప్పేది వీళ్ళే. నాకు అసహ్యం, జాలి వేసింది.

-పిల్లలకు పాఠాలు చెప్పటం మానేసి వీళ్ళకి చెప్పాల్సి వచ్చింది. బదిలీ చేస్తే ఉద్యోగమే ఒదిలేసి ఇక్కడే వుండిపోయాను. వీళ్ళ కష్టాలూ కన్నీళ్ళూ పంచుకున్నాను. అందర్నీ ఐక్యపరిచేను – అన్నాడు తాత.

-వాళ్లకు దొమ్మీలు నడపటానికి మనుషులు లేరు. గోకులంలో ముసలం పుట్టింది. వాళ్ళలో వాళ్ళే కొట్టుకుని కోర్టులకెక్కి నాశనం అయిపోయేరు. వాళ్ళందర్నీ మింగేసి జగన్నాథం తిమింగలంలా ఇలా బలిసిపోయాడు. కొంతకాలం ప్రశాంతంగా జరిగిన మన జీవితాల్లో మళ్ళీ వీడు అగ్గి పెట్టేడు.

-నెల రోజుల క్రితమే పీకలదాకా తాగి తలుపులు పగలగొట్టి మన వీరన్న కుటుంబాన్ని కుటుంబాన్నే నాశనం చేసింది. జగన్నాథం ముఠా, తెల్సుగా!

రాఘవులు గుండెలోని భయం పల్చబడుతోంది. అతని మనసులోని విషాదం వీరావేశాన్ని చేదుకుంటోంది.

-నిన్న గాక మొన్ననేగదా నీ అయ్యనీ, అన్ననీ చంపేసి, చెల్లిని చెరపట్టి చెరిచేసింది...

చర్రున లేచి నిలుచున్నాడు రాఘవులు.

-ఆపు,ఇంక సెప్పకు. సంపేత్తాను. ఆళ్ళందర్నీ సంపేత్తాను.

వూగి పోతున్నాడు రాఘవులు.

-ఆ... అలా దారికిరా. కాని చంపేది వాళ్ళని కాదు. వాళ్ళని చంపితే నష్టం నీకు గాని వాడికి గాదు. వాడికేం? మరో ముఠాని తయారు చేస్తాడు.

- అందుకని?

- అందుకని, అసలు వాణ్నే తీసెయ్యాలి.

-జగన్నాధాన్నా? అమ్మో... నా వల్ల కాదు. అడి దగ్గిర రౌడీలుంటారు. చంపేస్తారు.

మళ్ళీ నీరసించి పోయేడు రాఘవులు. నిన్నెవ్వరూ చంపలేరు, ధైర్యం చెప్పేడు తాత.

-ఇదిగో, ఈ కఱ్ఱ చూశావా? ఇది నీ చేతిలో వున్నంత వరకూ చచ్చిపోతారు తప్ప నిన్నెవరూ చంపలేరు. ఇది మామూలు కఱ్ఱనుకున్నావా? వుహు... పామును చంపిన కఱ్ఱ. అది మామూలు పావనుకున్నావేంటి? మొనగాడు పాము. నాగరాజు. అది చేటంత పడగ విప్పి తోక మీద లేచి ఆడతావుంటే, ఒక్కళ్ళూ దగ్గిరి కెళ్ళలేకపోయేరు. అప్పుడు మీ తాత, మూలనున్న యీ కఱ్ఱ బుజాన్నేసుకుని బరిలో కురికేడు. ఒక్కదెబ్బే! ఒకే ఒక్క దెబ్బకి నాగరాజు మట్టికరిచేసింది.

- నీ తాత మహా ధైర్యవంతుడా అంటే; అదీ గాదు. ఒట్టి పిరిగ్గొడ్డు. అయినా అంత సాహసం చేశాడంటే - అంతా ఆ కఱ్ఱ మహిమే. ఆ కఱ్ఱకి వోటమి లేదు. మీ అయ్య యీ కఱ్ఱతోటే ఎన్నో పోరాటాలు చేయించేడు.

-ఆ నాగరాజుకంటె గొప్పోడా యీ జగన్నాధం? నీకంటె గొప్పోళ్ళా నీ తాతా, నీ తండ్రీను, నువ్వు ఒక్క దెబ్బకే ఈ నాగుపామును పడగొట్టెయ్యాలి. నువ్వాళ్లో లేనట్టే లెక్క. నిన్నెవరూ అనుమానించరు.

-యేఁ... చంపుతారని భయపడుతున్నావా? చంపితే చావు. కాకిలా కలకాలం బతికే కంటే, పులిలా పురిటిలోనే చచ్చిపో. ఊరికోసం చచ్చేడన్న పేరన్నా మిగుల్తుంది.

-ఉహు...లేదు. నీకు పౌరుషం లేదు. తే,... ఆకఱ్ఱ యిలాతే, నేనే వెళతాను, ఆవేశంగా లేవబోయేడు తాత.

-ఒద్దు. నేనే ఎల్తాను. నా తాత నాగుబామును చంపినట్టు ఒక దెబ్బకే సంపేత్తాను.

-ఊఁ... అప్పుడే కాదులే. కొంచెం అగు. వూరు మాటుమణగనీ, అదిగో ఆ దీపం కన్పిస్తున్నది చూడు. అదే జగన్నాధం ఉంపుడు గత్తె ఇల్లు. ఊళ్ళో ఎవరూ లేరని విచ్చలవిడిగా తిరుగుతున్నాడు. ఇంకాస్సేపటికి అక్కడికొస్తాడు. చెరుకు తోటలో దాక్కునివేసెయ్.

ఊరు నిద్దరోయింది.

దూరంగా పొలాల్లోంచినక్కలు బృందగానం ఆలపిస్తున్నాయి.

రాఘవులు ఒగురుస్తూ పరుగెత్తు కొచ్చేడు.

-యేసేసాను తాతా, ఒక్క దెబ్బ. ఒకే ఒక్క దెబ్బకి తల పగిలిపోయింది.

ఊగిపోతున్నాడు రాఘవులు.

-శెభాష్ మనవడా... శెభాష్

కావిలించుకున్నాడు తాత.

-ఆణ్ని చూడగానే కాళ్లూ సేతులూ వొనికాయి తాతా. కర్ర చూసాను. అంతే... నువ్వు సెప్పినట్టు నిజంగానే కర్రలో మహత్తముంది తాతా...

-పిచ్చోడా, కర్రలో ఏం లేదురా మహత్తు. నీ శక్తిలో, సంకల్పంలో వుంది. ఈ కర్ర నీచేతిలో పనిముట్టు మాత్రమే. నువ్వు ఎలా ఉపయోగించుకుంటే అలాగే వుపయోగపడుతుంది.

-ఇదిగో ఈ అమ్మవారిని చూడు. ప్రాణం లేని ఒట్టి రాతిబొమ్మ. అంతా భయపడుతున్నారా లేదా? అదీ కొంత మంది చేతిలో పనిముట్టే. నీలాంటి నాలాంటి అమాయకుల బలహీనతల్ని ఆసరా చేసుకుని భయపెట్టి దోచుకోటానికి వాడుకునే బూచి. ఆ రాతి బొమ్మ ఎప్పుడూ ఎవర్నీ కరుణించిందీ లేదు. కరుణించక పోతే మరణించినవాళ్లూ లేరు.

-ఇంతకీ - నీ తాత నాగరాజునీ చంపలేదు. నీ నాన్న దొమ్మీలూ నడపలేదు.

-ఆఁ...

హూఁ.... ఇప్పుడైనా నీ శక్తిమీద నీకు నమ్మకం ఏర్పడిందా?

హోరుగాలి జోరుగా వీస్తోంది. రావి చెట్టు చప్పట్లు చరుస్తోంది.

-ఇంకిక్కడుండొద్దు పద. నువు చేయాల్సిన పనులు ఇంకా చాలా వున్నాయి.

●

*(కళాసాగర్ ఆరవవార్షికోత్సవ సంచిక 1978)*